بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ نَحْمَدُهٗ وَنُصَلّی عَلٰی رَسُوْلِهِ الْکَرِيْمِ وَعَلٰی عَبْدِهِ الْمَسِيْحِ الْمَوْعُوْدِ

# Summary of Friday Sermon Huzur-e-Anwar 04.09.2015 (Telugu)

**అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెలుపు అలవాటైనచో అల్లాహ్ తాలా మరింత అనుగ్రహించును. ఈ అనుగ్రహములను చూచి ఒక విశ్వాసి మరిన్ని త్యాగములకు సిద్ధమగును, చేయును. ఈ అంశ నిజమైన అవగాహన నేడు మన అహ్మదీయులకే గలదు. వీరి ముందు ఆఁహజ్రల్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలము కూడ గలదు, వారి నిజమైన బానిస కాలము, ఆదర్శము కూడ గలదు.**

*హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహుల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తాలా బినస్రిహిల్ అజీజ్ 04.09.2015 తేదీన మస్జిద్ బైతుల్ ఫుతూహ్ - లండన్, ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశము*

తషహ్హుద్, తఅవ్వుజ్, తస్మియ, సూర ఫాతిహా పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించిరి.

ఒకరిలో నిజమైన ధర్మబద్ధత ఏర్పడినచో అతనికి ప్రపంచ వరములన్నియు లభించునని అన్నచో ఒక ప్రాపంచిక వ్యక్తి నిశ్చయముగా ఇవి వృథా మాటలు, మతము పేరున ప్రజలను తమ చుట్టు కూడగొట్టుకొనుటకు వీరిలా మాట్లాడుదురని అనును. ఇది కూడ వాస్తవమే. ఎందుకంటే ఈ కాలములో మతము పేరున కొందరు ఇలాగే మాట్లాడుచున్నారు. వారి స్వార్థములుండును. స్వయాన వారిలో ధర్మబద్ధత యుండదు లేదా వారి అనుచరులలో కూడ ధర్మబద్ధత యుండదు. కాని నిజమైన సందేశహరులలో స్వచ్ఛమైన ధర్మబద్ధత అవగాహన యుండును. ఈ ప్రపంచములో యుండుచు, ప్రపంచ వ్యాపారములు చేయుచు ధర్మబద్ధతను అన్వేషింతురు, ధర్మబద్ధతను పాటింతురు. మాలో, మా సంతానములో అల్లాహ్ తాలా ధర్మబద్ధత కలిగించాలని కోరుచున్న వారి వందలాది ఉత్తరములు నాకు వచ్చును. నిశ్చయముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను విశ్వసించినందున, తమ బైఅత్ ప్రతిజ్ఞను గుర్తు చేసుకున్నందున ఈ భావన కలిగినది. ఈ కోరిక, అల్లాహ్ తాలాతో సంబంధము, భయము వలన వారు ప్రాపంచిక వస్తువులతో విముఖత కలిగినారు కాని ప్రాపంచిక వరములు వారికందనంత దూరము కాలేదు. అల్లాహ్ తాలా సందేశహరులకు కూడ తన వరములను ప్రసాదించును. కొన్ని సార్లు కొన్ని తాత్కాలిక కొరతలు ఏర్పడును. అనంతరం అల్లాహ్ కరుణించును, పరిస్థితులు చక్కబడును. నిష్టాపరుడు ఉన్నదానితోనే సర్దుకు పోవును. కనుక ఇబ్బందులను అతడు భరించును. అతనిని అల్లాహ్ కరుణించిన విషయమును బహిర్గతము కూడ చేయును. అల్లాహ్ తాలా ప్రసాదించిన కొద్ది దానికి కూడ కృతజ్ఞతలు తెలుపు అలవాటు నిష్టాపరునికి అగును. కృతజ్ఞతలు తెలుపు అలవాటు పడినచో అల్లాహ్ తాలా మరింత కరుణించును. అల్లాహ్ తాలాకు కృతజ్ఞతలు తెలుపు అలవాటైనచో అల్లాహ్ తాలా మరింత అనుగ్రహించును. ఈ అనుగ్రహములను చూచి ఒక విశ్వాసి మరిన్ని త్యాగములకు సిద్ధమగును, చేయును. ఈ అంశ నిజమైన అవగాహన నేడు మన అహ్మదీయులకే గలదు. వీరి ముందు ఆఁహజ్రల్ సల్లల్లాహు అలైహి వసల్లం కాలము కూడ గలదు, వారి నిజమైన బానిస కాలము, ఆదర్శము కూడ గలదు.

ఈ విషయమును ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. రసూలె కరీం సల్లల్లాహు అలైహి వసల్లం నుండి ప్రజలు మొత్తం దోచుకున్నారు. ఇలాగే అనుచరుల నుండి సర్వం దోచుకున్నారు. కాని వారు అల్లాహ్ తాలా తప్ప మరే విషయమును లెక్క చేయలేదు. తుదకు అల్లాహ్ తాలా వారికి సర్వము ప్రసాదించెను. ఇదే విధముగా హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం కూడ తమ కుటుంబములో అర్థ భాగమునకు వారసులైనను అల్లాహ్ తాలా కొరకు సర్వమును వీడిరి. తరువాత అహ్మదీ అగు అనుగ్రహము పొందిన వారి వదిన వారు ఉచితముగా భుజించుచున్నారని భావించేవారు. చాలా ఇబ్బంది కలిగెను. కాని అల్లాహ్ తాలా సర్వము బహుకరించెను. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం తమ ఈ స్థితిని తమ ఒక పద్యములో ఇట్లు చిత్రీకరించిరి.

لُفَاظَاتُ الْمَوَائِدِ كَانَ أُكُلِی وَصِرْتُ الْيَوْمَ مِطْعَامَ الْأَهَالِی

అనగా ఒకప్పుడు నేను ఇతరుల రొట్టె ముక్కలను భుజించేవాడిని. నేడు వేలాది మంది నా వద్ద భోజనము చేయుచున్నారు.

వారి ఆరంభ, తరువాతి కాలమును చూచి అహ్మదీయులమైన మన విశ్వాసము తప్పక పెరుగును. ఈ స్థితిని ప్రస్తావించుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఒక చోట ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జన్మించినప్పుడు వారి తల్లిదండ్రులు ఆనందపడిరి కావచ్చు. వారు యవ్వమునకు చేరుకున్నప్పుడు ఇహలోకము

నుండి అయిష్టతను చూపినందుకు వారి తండ్రి వారీ స్థితిని చూచి మా కుమారుడు అసమర్థుడని బాధ పడిరి. నాకొక సిక్కు చెప్పినాడని ఒక సంఘటనను హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) తెలిపిరి. మేము మిర్జా గులాం అహ్మద్ గారి వద్దకు వెళ్లి ఇట్లంటిమి. వారి చిన్న కుమారుడు ఏ పని చేయనందున పెద్ద కుమారుని ఆదాయముతో బ్రతుకునని మీ తండ్రి గారికి దుఃఖము కలుగుతున్నది. ఏదైనా పని చేయాలని వారు కోరుచున్నారు. మీరు మీ తండ్రి మాట ఎందుకు వినరు ? హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లు సమాధానమిచ్చిరి. నా తండ్రి అనవసరముగా బాధ పడుచున్నారు, నా భవిష్యత్తు గురించి చింతుంచుచున్నారు. నేను ఎవరి ఉద్యోగి కావాలో అతని ఉద్యోగినైతిని. సిక్కు వ్యక్తి ఇట్లు చెప్పెను. మేము హజ్రత్ మిర్జా గులాం ముర్తజా గారి వద్దకు వెళ్లి జరిగినదంతా చెప్పితిమి. అప్పుడు మిర్జా గారిట్లనిరి. అతడు ఈ విషయము చెప్పినచో మంచిదే. ఎందుకంటే అతడు అసత్యమాడడు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆరంభము ఇట్లుండెను. ఇప్పటికి అంతమునకు చేరలేదు, కాని ఒక తాత్కాలిక అంతము కనిపించుచున్నది. వారు మృతి చెందినప్పుడు వారి కొరకు త్యాగమగు వేలాది మంది యుండిరి. సేవ చేసేవారే కాక సత్రములో ప్రతి రోజు 2, 250 మంది భోజనము చేసేవారు. ఆరంభములో ఎవరైనా వారితో సమావేశమగుటకు వచ్చినచో భోజనము పంపగలరని తన వదినకు చెప్పగా అతనికి ఏ పని పాట లేదు, ఉచితముగా కూర్చొని తింటున్నాడని వదినగారనేది. కనుక వారు తన భోజనమునే ఆ అతిథికి ఇచ్చి, తను ఆకలితో యుండేవారు లేదా కొన్ని గింజలు నమిలి పూట గడుపుకునేవారు. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. దైవ చిత్రము చూగలరు. వారిని అవమానముతో చూచే ఆ వదినే తరువాత నా హస్తమున బైఅత్ చేసిరి. అల్లాహ్ తాలా ఏదైనా పనిని మొదలు పెట్టినప్పుడు దాని ఆరంభము పెద్దగా అనిపించదు, కాని అంతము ఆశ్చర్యము కలిగించు విధముగా యుండును. ఖాదియాన్‌లో కాదు ఖాదియాన్ బయట కూడ అనేక దేశములలో వారి సత్రము నడుచుచున్నట్లు మనము చూచుచున్నాము. అప్పుడు బహుశా రెండు మూడు తన్నూరులో రొట్టె వండేది కావచ్చు. కాని నేడు వారి సత్రములో రోటీ ప్లాంట్లున్నవి. ఖాదియాన్‌లో కూడ, రబ్వాలో కూడ. ఏక కాలంలో లక్షల రొట్టెలు తయారగుచున్నవి.

ఒకప్పుడు ఒక్క అతిథి వచ్చినా తమ ఆహారము అతనికిచ్చి తాము ఆకలితో యుండేవారు. కాని నేడు ప్రపంచములోని వివిధ దేశములలో వేలాది మంది వారి సత్రము నుండి రొట్టెలు తింటున్నారు. ఇదింకా అంతము కాదు. ఇంకా ఈ సత్రములు ప్రపంచములోని వివిధ దేశములలో వ్యాపించవలసి యున్నది. ఇన్షాఅల్లాహ్. లక్షలు, కోట్ల మంది వారి సత్రము నుండి తినవలసి యున్నది. ఇదే విధముగా లక్షలు, కోట్ల మంది వారిని నమ్మి నిష్టాపరతలో ముందడగు వేయవలసి యున్నది. ఇహలోకము సంపాదించుచున్న అహ్మదీయులలో కనిపించుచున్న త్యాగములు ఇంకా పెరగవలసి యున్నది. ఇన్షాఅల్లాహ్. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఆరంభ కాలమును దృష్టియందుంచుకొని ఒక్క సత్రమునే శ్రద్ధతో చూచినచో వారి సత్య నిదర్శనమగును. ఇది మన విశ్వాసమును నిశ్చయముగా పెంచును. ఈ మొత్తం వ్యవస్థను నడపడానికి ఆర్థిక త్యాగ స్ఫూర్తి జమాఅత్ సభ్యులలో కలిగినదని మనము చూచినచో ఇది కూడ హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను నమ్మిన తరువాత మనలో కలిగిన నిష్టాపరత ఫలితమే. మనలోని ప్రతి ఒక్కరిలో నిజమైన నిష్టాపరత కలిగించుకొనుటకు శ్రద్ధ ఏర్పడుటకు అల్లాహ్ అనుగ్రహించుగాక!

హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవితములోని వివిధ కోణములను పలు రకాలుగా హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ప్రస్తావింతురు. వీటి ద్వారా పలు సూక్ష్మమైన విషయములు తెలియును. తద్వారా మన జ్ఞానము పెరుగును. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భుజించు పద్ధతిని తెలుపుచు హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భుజించు పద్ధతి చాలా విచిత్రముగా యుండెను. అలా భోజనము చేయుచు నేనెవరిని చూడలేదు. రొట్టె నుండి ఒక్క ముక్కను వేరు చేసేవారు. ఆ ముక్కను భుజించే ముందు ఇంకా చిన్న ముక్కలు చేసేవారు. నోటితో సుబ్‌హానల్లాహ్, సుబ్‌హానల్లాహ్ అనుచు ఆ చిన్న ముక్కను కూరలో ముంచి భుజించేవారు. వారికి గల ఈ అలవాటును చూచేవారు ఆశ్చర్యపడేవారు. రొట్టెల నుండి హలాల్ ముక్కలను అన్వేషించుచున్నట్లు కనిపించేది. మనము భోజనము చేయుచున్నాము, దైవ ధర్మము ఆపదలలో యున్నదనే వారీ ఆవేదన. ప్రతి ముక్క వారి నోటి నుండి క్రిందికి దిగేది కాదు. సుబ్‌హానల్లాహ్, సుబ్‌హానల్లాహ్ అనుచు వారు అల్లాహ్ తాలా ఆస్థానములో నీవు ఈ వస్తువును ఎందుకు తప్పని సరి చేసినావని ఫిర్యాదు చేయుచున్నారు. అన్న పానీయము మానవునికి తప్పని సరి. ధర్మము ఆపదలో యున్నందున మేమీ ఆహారము భుజించుట సబబు కాదు.

హ॥జత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. వారి ఆహారము కూడ ఒక శ్రమ లాగే అనిపించేది. ఇస్లాం ధర్మ సహాయమునకు పడుచున్న సున్నితమైన మనసు మధ్య జరుగుచున్న యుద్ధమిది. అల్లాహ్ తాలా తరపున ప్రకృతి చట్టము ప్రకారము పూర్తి చేయవలసిన అవసరాల మధ్య జరిగేది. విధి లేక వారు ఆహారము భుజించేవారు. ధర్మ సహాయము, ఇస్లాం అభివృద్ధి వ్యాకులత వారికుండేది. అల్లాహ్ తాలా వరములను మనము ఉపయోగించినప్పుడు కృతజ్ఞతలు తెలుపవలెనని హ॥జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం జీవనశైలి మనకు బోధించును. అల్లాహ్‌ను స్తుతించుచు ధర్మ స్థితి బాధను కూడ అర్థము చేసుకొనుము. ధర్మ ప్రచారములో ఏ విధముగా మనము భాగస్వాములు కాగలమో ప్రయత్నించవలెను. హ॥జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం భుజించు ఈ పద్ధతి ద్వారా స్తుతించుట గురించి విశాల భావమును يُسَبِّحُ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ అనగా ఆకాశములో నున్నదంతయు, భూమిలో నున్నదంతయు అల్లాహ్‌నే స్తుతించుచున్నది, ద్వారా హ॥జత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఈ తత్వమును తెలిపిరి. అల్లాహ్ తాలా يُسَبِّحُ لِلّٰهِ مَا فِي السَّمٰوٰتِ وَمَا فِي الْاَرْضِ అన్నదాని అర్థమేమనగా మీరు ఆ స్తోత్రమును వినుము. ఈ స్తోత్రమును మనము వినగలమని తెలియుచున్నది. ఒకటి అల్ప శ్రవణ గలదు మరొకటి ఉన్నత శ్రవణ గలదు. కాని గొప్ప స్థాయి కనులు, చెవులున్నవారే ఉన్నత శ్రవణను వినగలరు. అందుకే భోజనము ప్రారంభించినప్పుడు బిస్మిల్లాహిర్రహ్మానిర్రహీం చదవాలి, భోజనము ముగించినప్పుడు అల్‌హందులిల్లాహ్ చదవాలి, వస్త్రము ధరించినా, మరేదేని దృశ్యమును చూచినా దాని ప్రకారము స్తుతించాలని ఒక విశ్వాసికి చెప్పబడెను. విశ్వాసి స్తుతించుటనగానేమి ? ఆయా వస్తువుల స్తుతించుటను విశ్వాసి బలపరచును. వస్త్రము, ఆహారము ఇతర వస్తువుల స్తుతించుటను అతడు బలపరచును.

మానవుడు భుజించినప్పుడు బిస్మిల్లాహ్ చదువును, భోజనము ముగించిన తరువాత అల్‌హందులిల్లాహ్ అనును. వస్త్రము ధరించినప్పుడు అల్లాహ్‌ను స్తుతించును. మానవుడు స్వయముగా చేయునదే స్తోత్రము. ఈ వస్తువుల వలన మానవుడు కృతజ్ఞతలు తెలుపుటయే ఆయా వస్తువుల వైపున స్తోత్రమగును. హ॥జత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఎందరు దీనిని ఆచరించుచున్నారు. దివారాత్రులు వారు భుజింతురు, త్రాగుదురు. పర్వతములను దాటుదురు, నదులను తిలకింతురు, సశ్యశ్యామలను దర్శింతురు, వృక్షములను, పంటపొలాలను కళకళలాడుచు చూచుదురు, చిలుక పలుకులను విందురు. కాని వారి హృదయములపై ఏ ప్రభావము పడుచున్నది. ఏదేని వస్తువు వలన మానవుడు చేయు కృతజ్ఞత లేదా అల్లాహ్ ప్రకృతిని దర్శించినప్పుడు సుబ్‌హానల్లాహ్ అనును. సంక్షిప్తమేమనగా మానవుడు ఏ ఏ వస్తువుల వలన స్తుతించునో ఆయా వస్తువుల తరపున స్తుతించినట్లగును. ఈ రహస్యమును అర్థము చేసుకోవలసిన అవసరమున్నది. స్తుతించు ఈ పద్ధతిని కూడ మనము పాటించవలసిన అవసరమున్నది. ఇటువంటి స్తోత్రము మన దినచర్య కావడమే మన నిష్టాపరత.

ఇస్లాం పై దాడి చేయువారి నోరు మూయించుటకు, ఇస్లాం అందమును బహిర్గతము చేయుటకు అల్లాహ్ తాలా ఈ కాలములో హ॥జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంను పంపెను. ఈ విషయములో ఒక సంఘటనను తెలుపుచు హ॥జత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఒక సారి హ॥జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మస్జిద్‌లో కూర్చొని యుండగా ఒక క్రైస్తవుడు వచ్చెను. పవిత్ర ఖుర్‌ఆన్ భాష అన్ని భాషలకు మూలమని మీరందురు. మేక్స్‌మూలర్ సిద్ధాంతము ప్రకారము భాషలకు మూలమైన భాష సంక్షిప్తముగా యుండును. హ॥జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఇట్లనిరి. భాషలకు మూలమైన భాష సంక్షిప్తముగా యుండునను మేక్స్ మూలర్ సిద్ధాంతమును మేము నమ్మము. అయినను వాదనను ముగించుటకు మేమీ సిద్ధాంతమును నమ్మెదము. ఈ సిద్ధాంతము ప్రకారము అరబ్బీ భాష యున్నదా లేదా అని పరిశీలించెదము. ఆంగ్ల భాష అరబ్బీ భాష కంటే చాలా గొప్పదని కూడ అతడని యుండెను. హ॥జత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాతు వస్సలాం గారికి ఆంగ్ల భాష రాకపోయేది. కాని అల్లాహ్ తాలా వారి నోట జారీ చేయించిన పదముల వలన విమర్శకుడు స్వయముగా ఇరకాటంలో పడెను. ఆంగ్లములో “నా నీరు”ను ఏమందురో చెప్పగలరని వారనిరి. అతడు My water అనెను. అరబ్బీలో కేవలం ‘మై’ అనడంతోనే ఈ అర్థము వచ్చును. My water ఎక్కువ చిన్నగున్నదా లేక ‘మై’ చిన్నగున్నదా చెప్పండి. ఆ వ్యక్తి తలదించుకొని ఇటులైనచో అరబ్బియే సంక్షిప్తముగా యున్నదని అంగీకరించెను. పవిత్ర ఖుర్‌ఆన్‌ది ఇదే పరిస్థితి. వారిని శత్రువుల దాడి నుండి రక్షించునని అల్లాహ్ తాలా వారితో వాగ్దానము చేసెను. శత్రువు ఖడ్గముతో దాడి చేసినప్పుడు ఖడ్గ ధారను తుంచివేసెను. శత్రువుల ఖడ్గములు విరిగిపోయినవి. అతడు చరిత్ర ద్వారా దాడి చేయగా చరిత్ర పుస్తకములను శోధించి శత్రువుల విమర్శలకు సమాధానమిచ్చే ముస్లిములను అల్లాహ్ తాలా నిలిపెను. స్వయముగా వ్యతిరేకుల పెద్దల పుస్తకములను తీసి ఇస్లాంపై చేయుచున్న విమర్శలు వారి

ధర్మముపై కూడ పడుచున్నాయని తెలిపిరి. పవిత్ర ఖుర్‌ఆన్, హదీసులకు సంబంధించిన వాటిని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం స్పష్టము చేసిరి.

నేడు కూడ ఇస్లాంను విమర్శించేవారి నోటిని మనము హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం రచనముల ద్వారా మూయించవచ్చును. కనుక ఇటు వైపు మనము శ్రద్ధ వహించవలెను. అల్లాహ్ తాలా స్వయముగా తన ధర్మమును బలపరచుటకు సంకేతములను చూపును, నిదర్శనములను కూడ సూచించును. విద్యా ఉత్సాహము గల వారి హృదయములను తెరుచును. కాని కొందరు విద్య అల్పమున్నను గొప్ప పండితులగు కోరికతో అనవసర మాటలు మాట్లాడుదురు. వీరి వలన కొన్ని సార్లు ఇబ్బందులు తలెత్తును. వ్యతిరేకులకు అవమానించు అవకాశము లభించును. హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. ఇటువంటి వ్యక్తులు అల్ప, అధికమునకు పాల్పడుదురు. ఏ నిబంధనను పాటించరు. మధ్యేమార్గమును అవలంభించవలెను. మార్పును స్వీకరించుటకు మానవుడు సిద్ధముగా యుండవలెను. మార్పు సృష్టించుట అల్లాహ్ తాలా హస్తములో గలదు. అతడు కోరినప్పుడు మార్పును సృష్టించును. ఆ మార్పును ప్రపంచము నిరోధించలేదు.

కొందరి ఆలోచనలు తప్పుగా యుండునను విషయము గురించి హజ్రత్ ముస్లిహ్ మౌవూద్ (రజి) ఇట్లనిరి. హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం హయాంలో ఒక వ్యక్తి ఖాదియాన్ వచ్చి, ఇట్లనెను. మీరు ఇబ్రాహీమ్, నూహ్, మూసా, ఈసా, ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం) అని మిర్జా గారిని అనబడినచో నన్ను కూడ అల్లాహ్ తాలా ఎల్లప్పుడు ముహమ్మద్ అని అంటుంటాడు. ప్రజలు అతనికి నచ్చజెప్పడం మొదలు పెట్టిరి. అల్లాహ్ తాలా రోజు నన్ను నీవు ముహమ్మద్ అన్నప్పుడు మీ నిదర్శనములు నాపై ఎలాంటి ప్రభావము చూపలేవు. ప్రజలు నచ్చజెప్పి విసుగు చెందినప్పుడు అతన్ని హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం ఎదుట ప్రవేశ పెట్టడమే మేలని భావించిరి. అతన్ని హుజూర్ ఎదుట ప్రవేశపెట్టిరి. అతడిట్లనెను. అల్లాహ్ తాలా ఎల్లప్పుడు నీవు ముహమ్మద్ అని అనును. హుజూర్ ఇట్లనిరి. అతడు నన్ను ఈసా అన్నప్పుడు ఈసా లక్షణములు నాకిచ్చును, నన్ను మూసా అన్నప్పుడు మూసా సంకేతములు నాకిచ్చును, అల్లాహ్ నిన్ను ఎల్లప్పుడు ముహమ్మద్ అన్నచో పవిత్ర ఖుర్‌ఆన్ జ్ఞానములు, రహస్యములు, విద్యలు నీకుచ్చుచున్నాడా లేదా ? ఏమి ఇవ్వడం లేదని అతడనెను. సత్యుని, అసత్యుని మధ్య ఇదే తేడా యున్నదని వారనిరి. ఒక వ్యక్తిని ఎవరైనా అతిథిగా ఆహ్వానించినచో భుజించుటకు అతనికి ఆహారమునందించును. కాని హాస్యమాడినచో పిలిచి ఉట్టి పాత్రలు ముందట పెట్టి ఇది బిర్యాని, ఇది తీపి వంటకమని అనును. అల్లాహ్ తాలా హాస్యమాడడు, షైతాన్ హాస్యమాడును. స్వప్నముల వలన అవగాహన లోపం కలిగి పెద్ద పెద్ద ప్రకటనలు చేయువారు షైతాన్ ప్రభావము క్రింద యుందురు. అల్లాహ్ తాలా ఎవరికైనా ఏమైనా ఇచ్చినప్పుడు అనుగ్రహించును కూడ. తన సహాయమును చూపును. సంకేతలమును బహిర్గతపరచును. అల్లాహ్ తాలా ఆచరణాత్మక చర్య అతని వెంట యుండును. మనము ఇదే విషయమును హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాంతో చూచితిమి. ద్వితీయ ఉత్తరాధికారి గురించి గల వారి భవిష్యవాణి ముస్లిహ్ మౌవూద్ పూర్తి అయినట్లు మనము చూచితిమి. ఖిలాఫతె అహ్మదియ్య స్థాపన గురించి గల వారి భవిష్యవాణి అల్లాహ్ తాలా ఆచరణీయ చర్యగా పూర్తి అయినట్లు మనము చూచితిమి. అల్లాహ్ తాలా ప్రతి అహ్మదీ విశ్వాసమును పెంచుగాక! ఈ విషయములను అర్థము చేసుకొనుగాక!

31 ఆగస్టు - 1 సెప్టెంబర్ 2015 మధ్య రాత్రిన గౌ॥ శ్రీమతి అమ్తుల్ బారి గారు మృతి చెందిరని హుజూర్ తెలిపిరి. اناللہواناالیہراجعون వీరు హజ్రత్ మసీహ్ మౌవూద్ అలైహిస్సలాం మనువరాలు. మిర్జా షరీఫ్ అహ్మద్ గారి కూతురు. నవాబ్ ముహమ్మద్ అలీ ఖాన్ గారి మనువరాలు. సయ్యదహ్ అమ్తుల్ హఫీజ్ - నవాబ్ అబ్దుల్లాహ్ ఖాన్ గారి కోడలు. నాకు అత్తమ్మ అగుదురు. వీరు 17 అక్టోబర్ 1928 తేదీన ఖాదియాన్‌లో జన్మించిరి. అల్లాహ్ తాలా వారి స్థాయిని పెంచుగాక! ఆమీన్. ✡✡✡

BOOK POST (PRINTED MATTER)

To,
.............................................................................
.............................................................................
.............................................................................